ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023
5

శ్రీకాకుళం

ఒక నామినేషన్ తిరస్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం జిల్లాలో మార్చి 13న జరగనున్న స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుని ఎన్నికల్లో భాగంగా దాఖలైన నామినేషన్లలో వైసిపి డమ్మీ అభ్యర్థి నర్తు శివాజీ నామినేషన్ తిరస్కరణకు గురైంది. వైసిపి అభ్యర్థిగా నర్తు రామారావు, స్వతంత్ర్య అభ్యర్థిగా ఆనెపు రామకృష్ణ బరిలో కొనసాగుతున్నారు. కలెక్టరేటులోని జాయింట్ కలెక్టరు ఛాంబరులో నామినేషన్ పత్రాలను స్థానిక సంస్థల మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నవ్య శుక్రవారం పరిశీలించారు. ఫారం 26 అఫిడవిట్ మాత్రమే దాఖలు చేసి, 2ఇ ఫారం జత చేయనందున, సెక్యూరిటీ డిపాజిట్ రూ.10వేలు కట్టనందున, నామినేషన్ పత్రం ఇసిఎల్ సూచించిన ఫార్మట్‌లో లేనందున పై మూడు కారణాలతో శివాజీ నామినేషన్ తిరస్కరించినట్లు నవ్య వెల్లడించారు.కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరి, సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, డిటి చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణ

- బోర్లు కోసం 5,714 మంది దరఖాస్తు
- ఇప్పటివరకు 246 చోట్లే తవ్వకాలు
- 13 మంది రైతులకే విద్యుత్ కనెక్షన్లు
- రెండున్నర ఏళ్లుగా రైతుల ఎదురుచూపులు

జిల్లాలో సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగానే ఉన్నాయి. ఆ భూముల్లో ఉచితంగా బోర్లు వేసి వాటిని వినియోగంలోకి తీసుకొస్తామంటూ వైసిపి ప్రభుత్వం రెండున్నర ఏళ్ల క్రితం వైఎస్ఆర్ జలకళ పథకాన్ని తీసుకొచ్చింది. బోర్లుతో పాటు విద్యుత్ కనెక్షను కూడా అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న తరుణంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో అన్నదాతల ఉత్సాహంపై నీళ్లు చల్లినట్లయింది. విద్యుత్తు కనెక్షన్ల ఖర్చు నిర్ణీత మొత్తం కంటే దాటితే రైతులే భరించాలని ప్రభుత్వం చెప్పడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం సెప్టెంబర్ 28, 2020లో ఈ పథకాన్ని ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాలు నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుతు కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.2 లక్షలోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని అంతకంటే ఎక్కువ అయితే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది.

ఇప్పటివరకు వేసిన వాటికి యథాతథంగా డబ్బులు చెల్లించనున్నట్లు తెలిసింది. ఇకపై కనెక్షన్లకు రైతులే చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. దీంతో ఇన్నాళ్లు ఉచిత విద్యుత్ కనెక్షన్లు వస్తాయని ఎదురు చూస్తున్న రైతులకు షాక్ ఇచ్చినట్లయింది. దరఖాస్తుదారుల్లో ఐదు ఎకరాలోపు ఉన్నవారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ప్రకారం అయితే వీరందరికీ ఉచితంగా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రాయితీని రూ.2 లక్షలకే పరిమితం చేయడంతో వందల సంఖ్యలోనే రైతులు అర్హత సాధించే పరిస్థితి నెలకొంది.

13 చోట్లే విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో వైఎస్ఆర్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 246 చోట్ల బోర్లు తవ్వారు. 229 ప్రాంతాల్లో నీళ్ల పడగా 17 చోట్ల నీరు పడలేదు. 13 మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

లక్ష్యానికి ఆమడ దూరంలో...

చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్‌టిఆర్ జలసిరి పేర్లతో ప్రభుత్వాలు అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైఎస్ఆర్ జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధుల లేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్లు తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. వేల మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే ఈ రెండేళ్లలో వందల సంఖ్యలోనే బోర్లు తవ్వారు. పదుల సంఖ్యలోనే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు

ఖర్చు పెరగడంతో రైతులు వెనుకడుగు

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే రూ.2 లక్షల అంచనా వ్యయం దాటిపోతుందని అధికారులు చెప్తుండటంతో బోర్లు వేయించుకునేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.5 నుంచి రూ6 లక్షలు దాటిపోతోంది. ఇప్పటికే 13 బోర్లుకు కనెక్షన్లు ఇచ్చారు. వాటిలో రూ.2లక్షలకు పైబడినవి ఉన్నా ఉచితంగానే లబ్ధి చేకూర్చారు. పథకం మధ్యలో ప్రభుత్వం అందిస్తున్న సాయానికి పరిమితి విధించడంతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో రైతులు విముఖత కనబరుస్తున్నారు. ప్రభుత్వ ఇచ్చే సాయం ఎటూ సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న తులసీదాస్

అదానీ అవినీతి దేశానికే మచ్చ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్
- రామలక్ష్మణ కూడలి వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, అదానీ అవినీతి అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు, అదానీ అవినీతికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన రామలక్ష్మణ కూడలి వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తులసీదాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారాలు వేసి కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చిందని, సబ్సిడీల్లో కోత పెట్టిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా బిజెపి మరోసారి మోసం చేసిందన్నారు. ఈ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.30 వేల కోట్లు, ఆహార సబ్సిడీలో ఏకంగా రూ.90 వేల కోట్లు కోత పెట్టిందని, ఎరువులు సబ్సిడీలు రూ.50వేల కోట్లు కోత విధించారని, వ్యవసాయ రంగానికి ఐదు శాతం గత బడ్జెట్ కంటే తగ్గించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్లో మొండి చేయి చూపిందని అన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వంటి వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయింపు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, పోలవరం కోసం, వైజాగ్ మెట్రోకు నిధులు ఊసే లేదని విమర్శించారు. సంపద సృష్టిస్తున్న కార్మికుల కోసం కనీసం ప్రస్తావనలేదని అన్నారు. అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందని, చిన్న మదుపుదార్లు, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసిని ముంచేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరులను అదానీపరం చేస్తుండటాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అదానీ అవినీతికి వ్యతిరేకంగా ముందుకు రావాలని కోరారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా పార్లమెంటులో రాష్ట్రానికి చెందిన సభ్యులు నోరెత్తడం లేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉపాధి కల్పన ప్రాజెక్టుల్లో ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులతో పాటు, కూలి పెంచాలని డిమాండ్ చేశారు. ఐదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలతో పాటు ఐదు కిలోల సబ్సిడీ ఆహార ధాన్యాలను పునరుద్ధరించాలని, ఆహార పదార్థాలు, మందులతో సహా నిత్యావసరాలపై జిఎస్‌టిని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, నాయకులు పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, షణ్ముఖరావు, ఎస్.ప్రసాద్, సిహెచ్ అమ్మన్నాయుడు, పి.ప్రసాద్, ఎన్.వి.రమణ, అల్లు మహాలక్ష్మి, ఎ.సోమశేఖర్, అల్లు సత్యనారాయణ, హెచ్.ఈశ్వరరావు, కె.సూరయ్య, ఎల్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు

మాట్లాడుతున్న శ్యామలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రులు, స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శాసన మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకేష్ లాఠకర్, స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నవ్య, నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, తదితర విషయాలపై శ్యామలరావు అడిగారు. శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ నామినేషన్ల ఘట్టం పూర్తయిందని, నామినేషన్ల పరిశీలన ఉందన్నారు. ఉప కలెక్టర్, డిఆర్‌డిఎ పీడీలు, పిఒ, ఎపిఒలకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ మార్చి 1వ తేదీన, మార్చి 8న నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన బ్యాలెట్ బాక్స్‌లు పరిశీలించి సిద్ధంగా ఉంచుకోవాలని మెప్మా పీడీని ఆదేశించారు. మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఎంసిసి టీంను ఏర్పాటు చేశారా? లేదా? అని ఆయన అడుగగా, అన్ని టీంలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. పోలింగ్ ఏజెంట్ల గురించి పరిశీలకులు అడుగగా పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. సిసి కెమెరాలు, తదితరమైనవి చూసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు, తదితర వాటిపై చర్చించారు. శాంతిభద్రతలు, బందోబస్తు గురించి పరిశీలకులు అడుగగా, బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి బాలరాజు తెలిపారు. సూక్ష్మ పరిశీలకులకు మార్చి 7వ తేదీన శిక్షణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ ఫిబ్రవరి 27న ఉంటుందన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు తరలింపుపై చర్చించారు. సింగిల్ విండో సిస్టంపై సెట్విస్ సిఇఒ ప్రసాదరావు తెలిపారు. వీడియో గ్రఫీ, వెబ్ కాస్టింగ్‌పై హౌసింగ్ పీడీ గణపతిరావు వివరించారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. డిటిసి సమావేశానికి హాజరు కానందువల్ల వివరణ తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులపై ఏ ఒక్కరూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. శ్రీకేష్ లాఠకర్ ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల పరిశీలకులకు కూలంకుషంగా వివరించారు. సమావేశంలో టెక్కలి, పాలకొండ సబ్ కలెక్టర్లు రాహుల్ కుమార్ రెడ్డి, నూరుల్ కమర్, అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు, డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి బాలరాజు, డిఎస్‌పి మహేంద్ర, ఆర్‌డిఒలు సీతారామ్మూర్తి, బి.శాంతి, ఉప కలెక్టర్ మురళీకృష్ణ, డిపిఒ రవి కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, హౌసింగ్ పీడీ గణపతిరావు, తదితర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎంసిఎంసి సందర్శన

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి, స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి)ని ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. ఎన్నికల సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని, మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారి కె.బి.ఎం.సింగ్‌కు పరిశీలకులు సూచించారు.

సమస్యలపై ప్రశ్నించే గొంతును గెలిపించండి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పట్టభద్రుల, ప్రజా సమస్యలపై చట్టసభలో ప్రశ్నించి, పరిష్కారానికి కృషి చేసేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం ఎంవిపి హెల్త్ ఎరీనాలో ఆమె ప్రచారం చేపట్టారు. పట్టభద్రులతో మాట్లాడారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలను మాటలతో మోసం చేస్తున్నాయన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నించటం లేదన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మూడున్నరేళ్లుగా ఒక్క నోటిఫికేషనూ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో

ఎంవిపి.కాలనీలో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

పిడిఎఫ్ బృందం ఆర్‌కెఎస్‌వి.కుమార్, రాజేశ్వరరావు, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, అష్రఫ్, చంటి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పిడిఎఫ్ అంటేనే విద్యావంతుల అభిప్రాయాలను శక్తివంతంగా, స్వతంత్రంగా వినిపించే వేదిక అని, తాజా, మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీల వారసత్వాన్ని కొనసాగిస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి, మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని అభ్యర్థించారు.

ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు

పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శుక్రవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార హంసను కలిశారు. కాగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలో ఐఆర్‌టి ఉపాధ్యాయులంతా పిడిఎఫ్ వెంటే ఉన్నారని, గత ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఓట్లేశామని, ఈ సారికూడా పిడిఎఫ్‌కు సంపూర్ణ మద్దతుగా ఉంటామని ప్రకటించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి.. 40 నామినేషన్లు

నాలుగు తిరస్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను విశాఖ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ సమక్షంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16న నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి చివరి రోజు గురువారం వరకూ 44 మంది 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిలో నాలుగు నామినేషన్లను తిరస్కరించారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ, విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగభారతి నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు. ఈ నెల 27 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. నామినేషన్ల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది, నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఉన్నారు.

నామినేషన్ల పరిశీలనలో పాల్గొన్న ఎన్నికల అధికారులు, ఎమ్మెల్సీ అభ్యర్థులు

సమస్యల మోత... ఏదీ ప్రగతి కూత

- పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల అవస్థలు
- అమృత్ భారత్ పథకంలో నాలుగు స్టేషన్లు

ప్రజాశక్తి -నౌపడ

రైల్వేకి ఆదాయం ఉన్నా ప్రయాణికులకు సరైన వసతులు కల్పించడం లేదనే విమర్శలున్నాయి. బోగీల్లోనూ వసతులు అరకొరగా ఉన్నాయి. ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఎసి కంపార్టుమెంట్‌లోనూ అదే పరిస్థితి. నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. టికెట్ ధరలు తక్కువ కావడంతో చాలా మంది ప్రయాణికులు రైలు ప్రయాణాన్ని ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో పలు రైల్వేస్టేషన్లో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. కొన్ని స్టేషన్లలో ప్లాట్‌ఫాం సమస్య. మరికొన్నింట్లో తాగునీటి సమస్య. ప్రధాన రైల్వే స్టేషన్లలో మరుగుదొడ్ల సమస్య అధికంగా ఉంది. వృద్ధులు, గర్భిణులు రైలు ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్నారు. పచ్చదనం అసలు కనిపించడం లేదు. గతంలో ఉన్న వృక్షాలు మినహా కొత్తగా మొక్కలు నాటలేదు. రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్లలో మొక్కలను పెంచాల్సి ఉంది. మరోవైపు ప్లాట్‌ఫాం పైకప్పు కొంతవరకే ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు ఎండలోనే రైళ్ల కోసం ఎదురుచూడాల్సి పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లాలో నాలుగు రైల్వే స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత స్టేషన్స్ పథకంలో భాగంగా అభివద్ధి చేస్తానని ప్రకటించడం కాస్త ఊరట కలిగిస్తుంది. మిగతా రైల్వే స్టేషన్లలో కూడా కనీస సౌకర్యాలు కల్పించాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

వసతుల లేమితో ఇబ్బందులు

శ్రీకాకుళం జిల్లాలో రైల్వే పరిధి మెయిన్ లైన్ 160 కిలోమీటర్లు, నౌపడ కూడలి నుంచి పాతపట్నం వరకు మరో 35 కిలో మీటర్ల దూరం విస్తరించి ఉంది. మొత్తం 27 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ప్రధానంగా శ్రీకాకుళం రోడ్డు, నౌపడ, పలాస, ఇచ్ఛాపురం స్టేషన్లు మంచి ఆదాయాన్ని సమకూర్చే పెద్ద స్టేషన్లు. ఇక్కడ ప్రయాణికులకు అవసరమైన వసతులు కల్పించడంలో రైల్వేశాఖ విఫలమవుతోంది. కొన్ని చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, తాగునీరు, పార్కింగ్ వసతులు లేవు. పచ్చదనం లోపించింది. వెయిటింగ్ హాళ్ల నిర్వహణ సక్రమంగా లేదు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ శాతం స్టేషన్‌కు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేదు. గతంలో నడిచేవి. ఆటో వాలాలు ఇష్టానుసారంగా ప్రయాణికుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నారు. రైళ్లు వచ్చే సమయానికి బస్సులు అందుబాటులో ఉంటే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వెంటాడుతున్న తాగునీటి కష్టాలు

పలాస, నౌపడ, దండు గోపాలపురం, కోటబొమ్మాళి, తిలారు రైల్వే స్టేషన్లో కుళాయిలు అలంకారప్రాయంగా ఉన్నాయి. ప్రయాణికుల తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోచోట నాలుగు కుళాయిల చొప్పున ఏర్పాటు చేసినా వాటి నిర్వహణ సరిగా లేదు. మూడు, నాలుగు చోట్ల తప్ప మిగిలిన ప్రాంతాల్లో నీరు రావడంలేదు. శ్రీకాకుళం, పలాస, నౌపడ, రైల్వే స్టేషన్లలో ఏళ్ల తరబడి మరుగుదొడ్డి తలుపులు తెరుచుకోలేదు. నిర్వహణ సక్రమంగా లేక మూసి వేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అమృత్ భారత స్టేషన్స్ ఎంపిక

కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో భాగంగా జిల్లాలో శ్రీకాకుళం రోడ్, నౌపడ, పలాస,

ఇచ్ఛాపురం నాలుగు స్టేషన్లు ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించింది. ఈ పథకం కింద ప్రతి స్టేషన్‌లో 53 రకాల మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తారు. ప్రతి స్టేషన్ కూడా ప్రత్యేక మాస్టర్ ప్లాన్ కింద అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

చేపట్టనున్న అభివృద్ధి పనులు

ప్రతి స్టేషన్‌లో భవనాలు, ఫ్లోరింగ్ ఆధునిక శైలిలో నిర్మాణం. ప్రస్తుతం ప్లాట్‌ఫాం 600 మీటర్ల పొడవుతో ఉన్నాయి. వాటి పొడవు 760 మీటర్ల నుంచి 840 మీటర్ల వరకు పెంచనున్నారు. స్టేషన్ల వద్ద ట్రాక్ శుభ్రత, సులభమైన నిర్వహణ కోసం బ్యాలెస్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండే ఎన్ఎస్ఒ ఏర్పాటు. వికలాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లు, ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ఇతర సదుపాయాలు. వెయిటింగ్ హాల్స్, వాటికి అనుబంధంగా కెఫెటేరియా. స్థానిక ఉత్పత్తుల విక్రయానికి కనీసం రెండు స్టాల్స్ ఏర్పాటు. ప్రతి స్టేషన్ మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్ ప్లాజా. సమావేశ మందిరాలు, స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు, పార్కింగ్ ఏరియా, పాదచారులకు ప్రత్యేక దారి. ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్, వేగవంతమైన వైఫై సేవలకు 5జీ టవర్లు వేయనున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను అణచివేయలేరు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - సోంపేట

45 ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులపై, ఉద్యమాలపై అక్రమ కేసులు బనాయించడం జరగలేదని, ప్రజాస్వామ్య దేశంలో ఉద్యమాలను నిర్బంధాలతో అణచివేయడం తగదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన మండల కేంద్రంలో 'ఉద్యోగుల హామీలు అమలు తీరు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. జిల్లా సహాధ్యక్షులు ఎల్.బాబురావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పిఆర్‌సికి వ్యతిరేకంగా లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఫిబ్రవరి 3న రోడ్డు మీదకు రావడంతో ప్రపంచ స్థాయిలో ప్రభుత్వం దోషిగా నిలబడిందని, దీన్ని జీర్ణించుకోలేని ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపుగా ఉద్యమాల మీద నిర్బంధాల ప్రయోగిస్తోందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిరసన చేస్తే నిర్బంధిస్తోందని, ప్రభుత్వం ఉద్యమాలకు భయపడుతుందా? అని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వమే కాలరాయడం తగదని హెచ్చరించారు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని పాత పెన్షన్ విధానం మాత్రమేనని అన్నారు. ఒపిఎస్ సాధన కోసం ఐక్య పోరాటం నిర్మిస్తామని తెలిపారు. శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు పదవుల కోసం పోటీ చేయడం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఆర్.పరమేశ్వరరావు, కోదండరావు, ఎస్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

పక్కాగా సమావేశాలు నిర్వహించాలి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రతి సంఘ సభ్యులూ క్రమం తప్పకుండా షెడ్యూలు ప్రకారం సమావేశాలు ఏర్పాటు చేయాలని ఎపిఎం పైడి కూర్మారావు సూచించారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్యలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మహిళలతో ఏర్పాటు చేసిన అన్ని సంఘాల లెక్కలూ గ్రామ సంఘం సిబ్బందైన విఒఎలకు తెలిసి ఉండాలన్నారు. సంఘ సభ్యుల పుస్తకాల్లో సక్రమంగా వివరాలు నమోదు చేయాలన్నారు. ఆ బాధ్యతను క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సక్రమంగా మానిటరింగ్ చేయాలన్నారు. గ్రామ సంఘాలు, స్వయంశక్తి సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పంచ సూత్రాలు పాటిస్తూ ఎ-గ్రేడ్‌లోనికి వచ్చేటట్లు చేయాలని సూచించారు. సంఘం సమావేశంలోనే తన సొంత నిధుల నుంచి అవసరమైన సభ్యురాలకు (ఇంటర్నల్ లెండింగ్) పొదుపు అప్పులు ఇచ్చుకోవాలన్నారు. తిరిగి వాయిదాల ప్రకారం సంఘం ఖాతాకు తిరిగి జమ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హరికృష్ణ, స్త్రీనిధి మేనేజర్ ఉదయ్, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కోటబొమ్మాళి: ఓపెన్ స్కూల్ ఇంటర్ మీడియట్ (సార్వత్రిక ఇంటర్ ప్రవేశాలు)లో 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక జూనియర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఇందిరకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై అనంతరం చదువును ఆపేసిన వారు, ఇంటర్ మీడియట్ పూర్తి చేయని విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు పదో తరగతి ఒరిజినల్ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోలతో ఈ నెల 27లోగా ధరఖాస్తును కళాశాలలో అందజేయాలని సూచించారు. ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి రత్నరాజు

చర్మ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- పోలాకి

ఎఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గ్రామాల్లో వైద్య సేవలు అందించే క్రమంలో చర్మ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి అనుమానిత కేసులను పిహెచ్‌సికి రిఫర్ చేయాలని గుప్పెడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రత్నరాజు సూచించారు. నరసన్నపేట బ్రైట్ ఫ్యూచర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన 'కుష్టు వ్యాధిపై పారామెడికల్ ఉద్యోగులకు శిక్షణ' శుక్రవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో నిర్వహించిన ఎల్సిడిసి సర్వేలో 95 కొత్త కుష్టు వ్యాధి కేసులను గుర్తించామని, అందులో 12 చైల్డ్ కేసులు ఉన్నాయని తెలిపారు. కొత్త కేసుల్లో గ్రేడ్-2 కేసులు రావడం ఆందోళనకరమని తెలిపారు. ఇఒ మెండ కృష్ణ బ్రైట్ ఫ్యూచర్స్ సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్రైట్ ఫ్యూచర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివగణేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యులు సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం శుచి, శుభ్రతతో నూటికి నూరు శాతం విద్యార్థులు స్వీకరించేలా ఉండాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యులు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య ఎంత, ఇంటి నుంచి ఎంతమంది భోజనం తీసుకొచ్చి స్వీకరిస్తున్నారన్న వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలు తీరు తెన్నులను, కోడి గుడ్లు, చికెన్‌లో నాణ్యతా ప్రమాణాలపై విద్యార్థులు, ఎంఇఒ రామారావు, ప్రధానోపాధ్యాయులు రమణమ్మ నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్షయ పాత్ర సంస్థ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నదీ లేనిది ప్రతి తరగతి గదిలో విద్యార్థుల నుంచి వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో తొమ్మిది వందల పై చిలుకు విద్యార్థుల్లో ఆరు వందల మంది విద్యార్థులు మాత్రమే భోజన పథకం స్వీకరించి, మిగతా వారు ఇంటి నుంచి భోజనం తీసుకువస్తుండడంపై అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇటువంటి విశిష్ట భోజన పథకం నిర్వీర్యం అవుతుండడాన్ని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. వచ్చే నెల రోజుల్లోగా ఎవరైతే భోజనం చేయడానికి అయిష్టతతో ఉన్న విద్యార్థులతోను, వారి తల్లిదండ్రులతోను మాట్లాడి వంద శాతం విద్యార్థులంతా భోజనం స్వీకరించేటట్టు కృషి చేయాలన్నారు. లేకుంటే భోజనం సరఫరా చేస్తున్న సంస్థను బ్లాక్‌లో పెట్టేందుకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. ఈయన వెంట ఎంఇఒ దుప్పల రామారావు, ఐసిడిఎస్ పిఒ కొత్తకోట బాలామణి, సూపర్‌వైజర్ లక్ష్మీబాయ్, సిఆర్‌పి జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవకుమార్ పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న సీతారాం

వాగ్వివాదానికి దిగిన వైసిపి నాయకులు

వైసిపిలో గ్రూపుల గోల

కళింగ సమావేశంలో రసాభాస

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం కళింగ సామాజిక తరగతిలో ముసలం రేగింది. ఒకే తరగతిలో వైసిపి అధికార, అసమ్మతుల మధ్య గ్రూపుల విబేధాలు మరోసారి బయటపడ్డాయి. ఇటీవల రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్‌పై మావోయిస్టు పేరుతో నకిలీ కరపత్రాలు విడుదల కావడంతో ఈ ప్రాంతంలో సంచలనం రేపింది. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాశీబుగ్గ డిఎస్‌పి శివరాంరెడ్డి ఆధ్వర్యాన పలువురిని విచారించారు. అందులో భాగంగా వైసిపి అసమ్మతి నాయకుడు దువ్వాడ హేంబాబు చౌదరి కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో విచారించారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించి శుక్రవారం ప్రయివేటు కళ్యాణ మండపంలో కళింగ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కళింగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పాట్నూరు సూర్యం పాల్గొన్నారు. కళింగ నేతలు దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, హేంబాబు చౌదరి మాట్లాడారు. అదే సమయంలో వైసిపి అధికార పార్టీకి చెందిన కళింగ సామాజిక తరగతికి చెందిన నాయకులు అల్లు వెంకటరమణ, మొదలవలస మన్మథరావు, చింతాడ మాధవరావు, శిష్టి గోపితో పాటు కొంత మంది వైసిపి నాయకులు సమావేశం వద్దకు చేరుకున్నారు. వారి మాటలపై జోక్యం చేసుకుని మంత్రి సీదిరి అప్పలరాజు పేరును ప్రస్తావించకుండా టార్గెట్ చేస్తూ మాట్లాడితే సహించేది లేదని కళింగ నాయకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. సమయం మించిపోవడంతో కొట్లాటకు దారితీసే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కళింగ నాయకులు జోక్యం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అర్ధాంతరంగా ఎటువంటి తీర్మాణాలు చేయకుండానే సమావేశం నుంచి వెనుదిరిగారు. అనంతరం అధికార పార్టీకి చెందిన కళింగ నాయకులు మాట్లాడుతూ హేమబాబు చౌదరిపై జరిగిన ఘటనపై మంత్రి, మా ప్రమేయం లేదని అన్నారు. అవసరమైతే కాశీబుగ్గ డిఎస్‌పి వద్దకు వెళ్లి దీనిపై చర్చిస్తామని చెబుతూ ఎవరికి వారు వెనుదిరిగారు.

ఎదుగుదలను ఓర్వలేక భయపెడుతున్నారు

జిల్లా వైసిపి కార్యదర్శి దువ్వాడ హేమబాబు చౌదరిని కాశీబుగ్గ పోలీసులు విచారించడం సరైన పద్ధతి కాదని కళింగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పొట్నూరు సూర్యం అన్నారు. కాశీబుగ్గ ప్రయివేట్ కళ్యాణ మండపంలో వైద్యులు, కలింగ పెద్ద జీతేశ్వరావు అధ్యక్షతన హేమబాబు చౌదరిని పోలీసులు విచారించడం నిరసిస్తూ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళింగ సామాజిక తరగతి ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ప్రేరేపిస్తున్నాయని ఆరోపించారు. అంతకుముందు హేమబాబు చౌదరి మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక పోలీసు చేత భయపెట్టినందుకు ప్రేరేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కళింగ సంక్షేమ సంఘం నాయకులు దువ్వాడ శ్రీకాంత్, బి.నాగరాజు, దువ్వాడ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ రంగవల్లికలు

ఇచ్ఛాపురం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సంబరాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ రంగవల్లిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 132 మంది విద్యార్థులు పాల్గొని, 66 రంగవల్లికలను కనులకింపుగా వేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రజినికుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో చిత్రలేఖన నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి ఈ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని తెలియజేశారు. విద్యార్థుల సృజనాత్మకత వెలికి తీయడానికి ఇది ఒక చక్కని అవకాశం అని తెలిపారు. పాల్గొన్న విద్యార్థులకు, విజేతలకు సైన్స్ డే సందర్భంగా ఈ నెల 28న ప్రోత్సాహకాలను అందించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రినాథరావు తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నా స్థలాన్ని ఇప్పించరూ...

కోటబొమ్మాళి: మండలంలోని అక్కయ్యవలసలో సర్వే నంబరు 40లోని 0.10 సెంట్లు స్థలాన్ని అక్రమణదారులు అక్రమించుకున్నారని, వారి నుంచి నా స్థలాన్ని నాకు ఇప్పించాలని విశ్రాంతి ఆర్మీ ఉద్యోగి తిమడాన లచ్చుమయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2000లో ఇదే గ్రామానికి చెందిన రావాడ అప్పన్న, రావాడ జోగులు, రావాడ దాలయ్య వద్ద నుంచి 0.10 సెంట్లు భూమిని రూ.4 వేలకు పంచాయతీ క్రయచిటీ ద్వారా కొనుగోలు చేశానని అన్నారు. అయితే ఇదే స్థలంలో రావాడ కరువయ్య కుమార్తె కుమారుడు త్ర శిమ్మయ్య కుటుంబీకులు దర్జన్యంగా ఇళ్లు కట్టే ప్రయత్నం చేసినప్పుడు గ్రామ పెద్దలకు తెలియజేశానని అన్నారు. అప్పుడు వారు ఇరువురిని పిలిపించి సర్ధిచెప్పి అ స్థలం జోలుకు వెళ్లవద్దని సూచించారని అన్నారు. అయితే ఇప్పుడు ఇదే స్థలాన్ని శిమ్మయ్య ఇతరులకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నారని, దీనిపై ఇటీవల టెక్కలి సబ్ కలెక్టర్‌కు, కోటబొమ్మాళి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తన దగ్గర ఉన్న ఆధారాలను పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.

అభినందనలు తెలుపుతున్న మంత్రి ధర్మాన

గవర్నర్‌ను కలిసిన మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ నజీర్‌ను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో పాటు ధర్మాన హాజరయ్యారు. అనంతరం ధర్మానను సిఎం గవర్నర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన గవర్నర్ నజీర్‌ను పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

తాళ్లవలసలో పర్యటిస్తున్న అచ్చెన్నాయుడు

అచ్చెన్నాయుడు పర్యటన

నౌపడ : సంతబొమ్మాళి మండలం తాళ్లవలస, చిన్నతుంగాం, జగన్నాథపురం గ్రామాల్లో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం పర్యటించారు. అయా గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ మేరకు ఆయా గ్రామస్తులు పలు సమస్యలు వివరించారు. తాగునీటి సదుపాయం అంతంత మాత్రంగానే ఉందని, వీధి దీపాలు మరమ్మతులు చేయడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల కొన్ని పింఛన్లు తొలగించారని, అర్హులైన వారికి వివిధ కారణాలతో పింఛన్లు మంజూరు చేయలేదని ఆయనకు తెలియజేశారు. ఉపాధి పనులపై అచ్చెనాయుడు ప్రశ్నించగా, పనులు ప్రస్తుతం చేపట్టడం లేదని సమాధానం ఇచ్చారు. ధాన్యం కొనుగోలు పూర్తి స్థాయిలో చేపట్టలేదని పలువురు రైతులు ప్రస్తావించారు. వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ రూపాలని కోరారు. ఈయన వెంట జీర్ భీమారావు, క్ర్రి విష్ణుమూర్తి, మెండ అప్పారావు, కుక్కల శ్రీను ఉన్నారు.

ట్యాబ్‌ల పనితీరును పరిశీలిస్తున్న ఎంఇఒ ధనుంజయ

డిజిటల్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ

కవిటి: పాఠశాలల్లో డిజిటల్ విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఎంఇఒ ధనుంజయ రెడ్డి అన్నారు. మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ ట్యాబ్ వినియోగం, దాని ఉపయోగాలను శుక్రవారం వివరించారు. అలాగే ట్యాబ్‌ల పనితీరు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పూర్తిస్థాయి డిజిటల్ విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దిలీప్‌కుమార్

వార్డు కౌన్సిలర్ రక్తదానం

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులో ఉన్న ఓ రోగికి అత్యవసర పరిస్థితుల్లో ఎ-పాజిటివ్ రక్తం అవసరమొచ్చింది. దీంతో వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ స్పందించి గురువారం రక్తదానం చేశారు. బాబా ప్రెస్ వీధిలోని నివాసం ఉంటున్న దాలయ్య అనారోగ్యంతో ఒడిశా బరంపుర్ ఎంకెజి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడిని పరా మర్శించేందుకు దిలీప్‌కుమార్ వెళ్లాడు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. రోగికి తక్షణమే ఎ-పాజిటివ్ రక్తం అవసరమని చెప్పడంతో దిలీప్‌కుమార్ స్పందించి వెంటనే రోగికి రక్తదానం చేశారు. బాధితుడు కుటుంబ సభ్యులు దిలీప్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : పోస్టల్ ఉద్యోగుల ఆందోళనలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టాఫీసు ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు గణపతి, రమేష్‌లు మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు విధిస్తూ కింది స్థాయి ఉద్యోగులను వేధిస్తున్న పోస్టల్ శాఖ ఉన్నతాధికారుల వైఖరిని తప్పుపట్టారు. కార్యక్ర మంలో జిల్లా పోస్టల్ ఉద్యోగుల జెఎసి నాయకులు హరికిషోర్, శివప్రసాద్, కోటి సూరిబాబు, ధర్మారావు, పోస్టుమాస్టర్ దుర్గారావు, పెన్షనర్ల సంఘం నాయకు లు రామచంద్రరావు, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పెద్దశానలో అధికారుల విచారణ

టెక్కలి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్కదారి పట్టాయని, అర్హులకు కాదని అనర్హులకు పథకాలు అందిస్తూ... పెద్దశాన పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని గ్రామస్తులు వ్యతిరేకించారు. ఈ మేరకు ఇటీవల సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు దీంతో టెక్కలి డివిజనల్ పంచాయతీ విస్తరణాధికారి అలివేలు మంగమ్మ, ఎంపిడిఒ ఉమాసుందరిలు గ్రామానికి చేరుకుని పథకాలు అమలుపై శుక్రవారం విచారణ చేపట్టారు. ఇప్పటివరకు అందిస్తున్న వారి వివరాలు జాబితా, కొత్తగా మంజూరైన జాబితాలు పరిశీలించారు. వాలంటీర్లు, లబ్ధిదారులు, అర్హులు తదితరులపై విచారణ చేపట్టారు. ఈ నివేదికను సబ్ కలెక్టర్ అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.

ముగ్గురికి గాయాలు

బూర్జ : మండలంలో పెద్దపేట ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ సమీపంలో శుక్రవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయాయి. శ్రీకాకుళం నుంచి అల్లెనుకు చెందిన పెంకి రవణ, ఆయన భార్య కృష్ణవేణి వస్తుండగా, మదనాపురానికి చెందిన సింహాద్రి ప్రసాదరావు పాలకొండ వైపు నుంచి వస్తుండగా ఢీకొన్నాయి. స్థానికులు క్షతగాత్రులను ఓ ప్రయివేటు వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.5.37లక్షలు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కోటబొమ్మాళి : స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని 82 రోజుల ధర్మ హుండీలను శుక్రవారం లెక్కించారు. ఇందులో రూ.5,37,807లు ఆదాయం వచ్చిందని కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహధికారి వి.వి.సూర్యనారాయణ తెలిపారు. పాతపట్నంకు చెందిన నీలమనిదుర్గ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు ఆధ్వర్యాన ఈ హుండీల లెక్కించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, బోయిన కృష్ణారావు, కమిటీ సభ్యులు, కొత్తమ్మతల్లి ప్రత్యేక అహ్వానితులు బాడాన గోవిందరావు, దేవాదాయ సిబ్బంది, ఆలయ అర్చకులు కమ్మకట్టు అప్పలరాజు రెడ్డి, కమ్మకట్టు మాధవరెడ్డి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలని వినతి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లకు చెందిన సర్వే నంబరు 56/2లో ఉన్న ప్రభుత్వ చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణలను తొలగించాలని బ్రాహ్మణతర్ల మాజీ ఎంపిటిసి గరువు సింహాచలం, వడ్డీ యాదగిరి, రఘుపాత్రుని సుదర్శనరావు, ఆళ్ల వెంకటరావు, సల్ల విశ్వనాథం, నెయ్యిల గోపి కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఎల్.మధుసూదనరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరు చెరువును కొంతమంది ఆక్రమణదారులు రాత్రి వేళలో మట్టి వేసి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే చెరువు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

లేఖపై నిజ నిర్ధారణ తేల్చాలి

పలాస : కొద్ది రోజుల క్రితం రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదనలపై హత్యలకు పాల్పడతామని హెచ్చరిస్తూ... మావోయిస్టు సాధన కమిటీ పేరుతో నకిలీ లేఖ (సుడో నక్సలైట్లు) విడుదలైందని, ఈ లేఖపై నిజనిర్ధారణలను తేల్చాలని సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి అనైతిక చర్యలు సరికాదన్నారు. ఈయనతోపాటు రామారావు, అప్పారావు, మల్లేశ్వరరావు, దుష్యంతు, గేదెల జగదీశ్వరరావు, మద్దిల కైలాష్, జగదీష్, రాజారావు, దున్న శ్రీనివాసులు ఉన్నారు.

వంగవీటి రంగాకు నివాళి

లావేరు : వంగవీటి మోహన్ రంగా పేదలు పెన్నిధి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టిడిపి నాయకులు యినపకుర్తి భాస్కరరావు అన్నారు. మండల కేంద్రం లావేరు కూడలిలో వంగవీటి మోహన్ రంగా కాంస్య విగ్రహం ఏర్పాటై ఏడాది పూర్తయిన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గోవిందపురం మాజీ ఉప సర్పంచ్ ఇజ్జు బాబూరావు, చిక్కలా ఎల్లందొర, లంకలపల్లి కృష్ణ, ఇజ్జు శంకరరావు, యేసు పాల్గొన్నారు.

కక్షపూరిత చర్యలు విడనాడాలి

టెక్కలి: కక్షపూరితంగా వ్యవహరిస్తూ... పాలనలో అప్రజాస్వామికంగా వ్యవహరించే విధంగా వైసిపి పాలన ఉందని టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ ఎస్‌సి సెల్ విభాగం నాయకులు కూరాకుల యాదవ్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ నాయకుని ప్రసంగాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై అక్రమంగా కేసులు బనాయించడం సమంజసం కాదన్నారు.

వాహనాల తనిఖీ

మెళియాపుట్టి : మండలంలోని చాపర, వసుంధర గ్రామాల్లో తహశీల్దార్ పి.సరోజని, ఎస్ఐ టి.రాజేష్‌లు శుక్రవారం ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళి పక్కాగా ఉండేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న మాధవరావు

మోదీ, అదానీ ఇద్దరూ మోసగాళ్లే

సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మాధవరావు

పలాస : మోదీ, అదానీలు పెద్ద మోసగాలేనని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు విమర్శించారు. మండలంలోని నీలావతిలో పోతనపల్లి జయమ్మ మూడో వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నక్సల్ బరి శ్రీకాకుళం ఉద్యమాల స్ఫూర్తితో జయమ్మ 53 సంవత్సరాలు విప్లవ రాజకీయాల్లో కొనసాగారని అన్నారు. ఆమె మరణం వరకూ తను ప్రజల పక్షాన నిలబడి పిడిత ప్రజలు గొంతు కోసం పనిచేశారని అన్నారు. గుజరాత్‌కు చెందిన దోస్తులు ఆదానికి లక్షల కోట్ల రూపాయలు సంపాదించి పెట్టడంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాలు కీలకంగా కృషి చేశాయని అన్నారు. మోడీని అధికారంలో ఉంచడానికి కార్పొరేటర్ శక్తులు ఏకవుతున్నాయన్నారు. పారిశ్రామిక పెట్టుబడుల సంస్థ మోడీ ఆదానీలు ఇద్దరు కలిసి దేశ సహజ వనరులను సంపదలను దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ఫ్యాక్షనిస్ట్ పాలన కొనసాగుతుందని విమర్శించారు. జిఒ నంబరు ఒకటి ద్వారా ప్రశ్నించే గొంతులకులను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వారికొక నీతి, ఇతరులకు ఒక నీతిలా జగన్ వ్యవహరిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులపైన సరైన దృష్టి కొరవడిందన్నారు. మోడీ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా జగన్ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జయక్క స్ఫూర్తితో పీడిత తాడిత ప్రజల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గోరకల బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో పతాకావిష్కరణను జయమ్మ కుమారుడు పోతనపల్లి మల్లేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతి సమైక్య జిల్లా అధ్యక్షులు రామారావు, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, మామిడి భీమారావు, మన్యం జిల్లా అఖిల భారత రైతు కూలి సంఘం అధ్యక్షులు వెలగాడ కృష్ణ, భైరి కూర్మారావు, మామిడి భీమారావు, సవర బంగ్లా కుమార్, వినోద్, సోమేష్, కుత్తం వినోద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అధికారులతో ఎపిజిఇఎ నేతలు

ప్రజాశక్తి- రణస్థలం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి గొంటి తిరుపతిరావు అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ మార్చి 1న శ్రీకాకుళం రానున్న నేపథ్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి, సహాధ్యక్షులు కిలారి నారాయణరావు, నీలాద్రిరావు, భాస్కరస్వామి తదితరులు రణస్థలం మండల అధికారులకు కార్యక్రమానికి మద్దతు తెలపాలని శుక్రవారం కోరారు. అనంతరం ఎంపిడిఒ ధనుంజయరావు, సబ్‌ట్రెజరీ ఆఫీసర్ లిల్లీ షారూన్, ఎంఇఒ ఎ.త్రినాథరావు చేతుల మీదుగా కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగుల జిల్లా జాయింట్ సెక్రటరీ, మండల ప్రెసిడెంట్ గణపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ అమ్మోజి బమ్మిడి, ట్రెజరర్ శంకరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐఎఫ్‌టియు మహాసభలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఐఎఫ్‌టియు 9వ రాష్ట్ర మహాసభలు నగరంలోని కళింగ భవన్‌లో శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి క్రాంతి, ప్రధాన కార్యదర్శి గణేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం నుంచి ఏడు రోడ్ల కూడలి మీదుగా మహాసభల వేదిక వరకు కార్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం 11 గంటలకు సభ ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రారంభ సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేస్తారని చెప్పారు. సభలకు ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ అధ్యక్షత వహిస్తారని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ప్రారంభ ఉపన్యాసం చేస్తారన్నారు. కార్యక్రమానికి ఐఎఫ్‌టియు జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ ముఖ్య వక్తగా పాల్గొంటారని చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం రెండో ఏడాదికి చెందిన 208 విద్యార్థులకు ఐతమ్ ఎపిఎస్ఎస్ఎసి, ఆర్‌పిఎస్ క్వాలిటీ సర్టిఫికేషన్ ప్రయివేటు లిమిటెడ్ హైదరాబాద్ సంస్థలు 'నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అండ్ ఎవల్యూషన్ మెతడ్స్' అనే అంశంపై సంయుక్తంగా వారం రోజుల పాటు వర్క్‌షాపును నిర్వహిస్తోందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హేండ్స్ ఆన్ వర్క్ షాప్ ఆన్, అండ్ మెతడ్స్, హేండ్స్ ఆన్ ట్రెయినింగ్ సెషన్ ఆన్ ఇన్స్పెక్షన్ మెతడ్స్ ఆఫ్ వెల్డింగ్ ప్రాసెస్, ఎక్స్ టెర్మినేషన్ ఆన్ మోస్ట్ కామన్లీ టెస్టింగ్ మెతడ్స్ లైక్ రేడియో గ్రాఫిక్స్ అండ్ ఆల్ట్రాసోనిక్ టెస్టింగ్ మేగ్నటిక్ పార్టిసియల్ ఇన్స్పెక్షన్, టైప్స్ ఆఫ్ వెల్డింగ్ మెతడ్స్, రోల్ ఆఫ్ వెల్డింగ్ ఇన్స్పెక్టర్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ట్రెయినింగ్ సెంటర్ కో-ఆర్డినేటర్ రాజ్కుమార్, ప్రత్యేక శిక్షకులు భరత్ నేతృత్వంలో జరిగే ఈ తరగతులను ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్, ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్చడి డాక్టర్ డి.శ్రీరాములు, ఎపిఎస్ఎసిసి స్పాక్ డాక్టర్ వి.అశోక్‌కుమార్, బ్రాంచి కో-ఆర్డినేటర్ డి.రఘువీర్లు పర్యవేక్షణ చేస్తున్నారు.

విదేశీ విద్యపై అవగాహన

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల కెరియర్ గైడెన్స్ సెల్, విశాఖ న్యూఎడ్జి సంస్థలు 'విదేశాల్లో ఉన్నత విద్య' అనే అంశంపై శుక్రవారం బిటెక్ ద్వితీయ, ఆఖరి ఏడాది విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించాయి. యుఎస్ఎ కెనడా వంటి దేశాల్లో ఉన్నత విద్య చదువుకున్న వారు గొప్ప ఉద్యోగాల్లో స్థిర పడి ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని నిపుణులు శ్రీకాంత్ కిరణ్, భోగీ కిరణాలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావులు మాట్లాడారు.

నాగేశ్వరరావుతో శిక్షకులు